క్లుప్తంగా

దెబ్బతిన్న పంటల పరిశీలన



అల్లిపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

ధారూరు: అకాల వర్షాలతో అల్లిపూర్, కేరెళ్లి, బాచారం, అవుసుపల్లిలో దెబ్బతిన్న పంట పొలాలను మంగళవారం ధారూరు వ్యవసాయ విస్తరణ అధికారి సంజూ రాథోడ్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం కొందరు రైతులు అధికారితో మాట్లాడుతూ.. చేతికొస్తుందనుకున్న పంటలు దెబ్బతిన్నాయని వాపోయారు. మొక్కజొన్న, జొన్న, కూరగాయలు, ఉల్లి, చామంతి పూలసాగు వడగళ్లకు తుడిచి పెట్టుకుపోయాయని, నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని కోరారు. దీంతో ఏఈఓ మాట్లాడుతూ పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, రైతుల ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించామని, వివరాలను నమోదు చేసుకొని పై అధికారులకు నివేదిక పంపించనున్నట్లు ఆయన తెలిపారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



ఎంపీటీసీ శంకర్‌ను పరామర్శిస్తున్న టీఆర్‌ఆర్

కుల్కచర్ల: ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న చౌడాపూర్ ఎంపీటీసీ శంకర్‌ను మంగళవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. ఎలాంటి సాయం కావాలన్నా చేస్తామని భరోసా కల్పించారు. ప్రజాసేవ చేసేవారికి ప్రజల ఆశీర్వాదం ఉంటుందని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ తాము అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, పలువురు నేతలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

అనంతగిరి: వీఆర్‌ఏల 2 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వీఆర్‌ఏ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వీఆర్‌ఏలు వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ గిరి తదితరులు

కుల్కచర్ల: సమాజంలో చోటుచేసుకుంటున్న సంఘటనలు, అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ గిరి అన్నారు. మంగళవారం కుల్కచర్ల, బండవెల్కిచర్ల పాంబండ జాతరలో చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని, బాల్యంపై జరుగుతున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని, అలాంటివి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ అధికారులు రాంచంద్రయ్య, రాములు స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకుంటా..

దోమ: నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మోత్కూర్ గ్రామానికి చెందిన గునిగారి రాములు అనారోగ్యంతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న ట్రస్ట్ చైర్మన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. పేద వారిని విద్య, వైద్య పరంగా ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి పాటుపడండి
- మండలంలో రూ.3.20 కోట్లతో సీసీరోడ్లు
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీపీ మల్లేశం అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతో పాటు అవసరం ఉన్న చోట స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన పంచాయతీ దేవనోనిగుడలో ఇళ్ల నిర్మాణాలు పెరిగాయని, సరిపడా విద్యుత్ స్తంభాలు లేక కట్టెల సపోర్టుతో.. ఇళ్లపై నుంచి విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటున్నారని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని సర్పంచ్ బుచ్చన్న సభ దృష్టికి తెచ్చారు. నిజాంపేట్ మేడిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ లేక కరెంట్ సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతుందని సర్పంచ్ పెంటమ్మ సభ దృష్టికి తేగా.. గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

మద్యం విక్రయదారులపై చర్యలు..

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పారు. మండలంలోని పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న కిచెన్‌షెడ్‌లు, టాయిలెట్లను త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. బెల్ట్ దుకాణాలను నియంత్రించాలని సర్పంచ్ శ్రీధర్‌గుప్తా, కొత్తపల్లి ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. ఇష్టానికి మద్యం విక్రయిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మండలంలో ఇప్పటి వరకు రూ.3.20 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల, పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మైపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్యేతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

పరిగి: పే స్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సెర్ప్ ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కేంద్రంలోని కార్యాలయం ఎదుట ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2002 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగా పని చేస్తున్న తమకు జీవో 11 ప్రకారం పే స్కేల్ మంజూరు చేసి, క్రమబద్ధీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవితాల్లో వెలుగు నింపిన కేసీఆర్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, ఏపీఎంలు శోభ, సురేశ్, దోమ సీసీ నారాయణ, జంగయ్య, కుల్కచర్ల సీసీ శ్రీనివాస్, సెర్ప్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మారిని తరిమికొడదాం..

టీబీ చికిత్స పర్యవేక్షకుడు రాహత్ అలీ హైదర్



క్షయ నిర్మూలన అవగాహన ర్యాలీలో విద్యార్థులు, సిబ్బంది

కొడంగల్ రూరల్: క్షయ(టీబీ)వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని టీబీ చికిత్స పర్యవేక్షకుడు రాహత్ అలీ హైదర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే పాఠశాలలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం(మార్చి 24) పురస్కరించుకొని విద్యార్థులకు క్షయపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కలిసికట్టుగా పోరాడుదాం.. క్షయ మహమ్మారిని తరిమికొడదాం అని పిలుపునిచ్చారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ప్రతి సర్కారు దవాఖానలో ఉచితంగా పరీక్ష చేస్తారని, వ్యాధి నిర్ధారణ అయితే రోగి పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.500 ఖాతాలో జమ చేస్తారని తెలిపారు. క్షయవ్యాధి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ నరేష్‌రాజ్, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

మాకూ పే స్కేలు అమలు చేయండి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తెలంగాణ సమగ్ర ఉద్యోగుల డిమాండ్

అనంతగిరి: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించి, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పే స్కేలు అమలు చేయాలని వికారాబాద్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ రేణుకాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఆర్‌పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గాంగ్యనాయక్, జేఏసీ అధ్యక్షుడు ప్రభాకర్, మహిళా అధ్యక్షురాలు స్వప్నరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖకు అనుబంధంగా ఉన్న సమగ్ర శిక్షలో 21వేల మంది ఉద్యోగులు కాంట్రాక్టు ప్రాతిపదికన 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని, తమ విషయంలో కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. నాయకులు కృష్ణయ్య, శేఖర్, రాములు, రజిత, వెంకటయ్య, రాఘవేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేలో యునిటీ కప్ క్రికెట్ టోర్నీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టోర్నీ నిర్వాహకులు

- విన్నర్ జట్టుకు రూ.3 లక్షలు, రన్నరప్‌కు రూ.1.50 లక్షల నగదు
- వ్యక్తిగత అవార్డులు సైతం..

తాండూరు టౌన్: మే 2వ తేదీ నుంచి 14వరకు తాండూరు యునిటీ కప్ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాతతాండూరులోని రెడ్డి గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ వరాల శ్రీనివాస్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకులు అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని, ఇందులో భాగంగానే పెద్ద ఎత్తున యునిటీ కప్ సీజన్ వన్, పది ఓవర్ల టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని ఏర్పాటు చేశామని తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.3 లక్షలు, రన్నరప్ జట్టుకు రూ.1.5లక్షల నగదును అందజేయనున్నామని వెల్లడించారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.25వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.5,500, బెస్ట్ బౌలర్‌కు రూ.5,500ల నగదు అందజేస్తామని చెప్పారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 30 వరకు టీం రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్కో జట్టు రూ.3వేల ఎంట్రీ ఫీజు చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు సంజీవరావు, గుండప్ప, రియాజ్, గణేశ్, రాజ్‌కుమార్, మొయిజ్ ఖాన్, మోసిన్, హరీబ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి కృషి



విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తదితరులు

పాఠశాలల్లో సమస్యలుంటే చెప్పాలి: ఎంపీపీ

పరిగి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. మండల పరిధిలోని గడిసింగాపూర్, సుల్తాన్‌పూర్ తదితర పాఠశాలల్లో మంగళవారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా ఎగ్జామ్ ప్యాడ్‌లను విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా.. వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యాలయాల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు కొనసాగుతున్నాయని, కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ.. ఇంటి దగ్గర చదివేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిప్రియ, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో పేదలకు మేలు

- అంధత్వ నివారణకు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- నేత్ర వైద్య శిబిరంలో ప్రజాప్రతినిధులు



దోమ: ఐనాపూర్‌లో కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

దోమ: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ విజయ తెలిపారు. మంగళవారం ఐనాపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగును ప్రారంభించడం హర్షించదగ్గ విషయమన్నారు. అంధత్వ నివారణే కార్యక్రమ లక్ష్యమని, ఇది పేదలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. కంటి పరీక్ష అనంతరం మందులు, అవసరమైన వారికి కళ్లద్దాలు, శస్త్ర చికిత్స సైతం ప్రభుత్వమే చేయిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుగ్గయ్య, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దృష్టిలోపం ఉన్న వారు..

కొడంగల్ రూరల్: 'కంటివెలుగు'ను దృష్టిలోపం ఉన్న వారు వినియోగించుకోవాలని సర్పంచ్ అనిత చెప్పారు. అన్నారంలో కొనసాగుతున్న కంటి వైద్య శిబిరంలో దృష్టి లోపం ఉన్న వారికి కళ్లద్దాలు అందజేసి మాట్లాడారు. కంటి జబ్బు ఉన్న వారికి ప్రభుత్వం తరపున కంటి పరీక్ష చేసి, ఉచితంగా మందులు, అద్దాలు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరుణ్, డాక్టర్ మహేందర్‌రాజ్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అనిత

కంటిపాపను కాపాడుకోవాలి

తాండూరు రూరల్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష చేయించుకొని కంటిపాపను కాపాడుకోవాలని సర్పంచ్ బుడ్డెల్లి సాయిలు సూచించారు. కోత్లాపూర్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం సంతోషకర విషయమన్నారు. కంటి పరీక్ష అనంతరం ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ దేవాలయ చైర్మన్ సందీప్‌రెడ్డి, డాక్టర్ వినోద్, ఏఎన్‌ఎం రాధ, నాయకులు సాయప్ప, సురేష్, రాజయ్య, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

అనంతగిరి: ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ధారూర్ మండలం తరిగోపుల గ్రామానికి చెందిన జావిద్(52) వికారాబాద్‌లో పనులు ముగించుకుని రాత్రి భార్యతో కలిసి బైక్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. గోధుమగూడ సమీపంలో బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లికి చెందిన ఆంజనేయులు బైక్‌పై వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో జావిద్‌కు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయులు, మృతుడి భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నష్టపరిహారం ఇవ్వాలి

చేవెళ్ల: అకాల వర్షాలకు రాష్ట్రంలో సుమారు 5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి అల్లి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఒత్తిడిని జయిస్తే విజయం మనదే



కుల్కచర్ల: విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్ కుమార్

- ప్రశాంతంగా పరీక్షలు రాయాలి
- కుల్కచర్ల తహసీల్దార్ రమేష్ కుమార్

కుల్కచర్ల: పరిస్థితులను బట్టి ఒత్తిడి తట్టుకుంటూ ముందుకు సాగితే విజయం మన సొంతమవుతుందని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనానికి వినియోగించే నీరు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, స్టాక్ రిజిష్టర్ సరైన విధంగా నిర్వహించాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనయ్యే పరిస్థితులు తెచ్చుకోవద్దని, మానసికంగా ప్రశాంతంగా ఉంటే పరీక్షలు బాగా రాయగలుగుతారని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి దేవి, గిర్దావరి ఖాజ, సీనియర్ అసిస్టెంట్ శీనయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పయ్య

ఇష్టపడి చదవాలి: సీఐ

బంట్వారం: కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని ధారూరు సీఐ అప్పయ్య అన్నారు. కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై పలుఅంశాలపై ఆయన అవగాహన కల్పించారు. పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకూడదని, లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. ప్రణాళికా బద్ధంగా చదివి, మంచి గ్రేడ్ సాధించాలని చెప్పారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టం, డయల్ 100పై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణరాజు, ఏఎస్‌ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కార్పొరేషన్‌లో అందరికీ అవకాశం
- చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్
- రుణాలకు 50 మంది ఎంపిక



లక్కీడ్రా తీస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు: ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తుందని, ఇప్పటికే ఎన్నో రకాల సంక్షేమ పథకాలను అమలు చేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల లక్కీ డ్రా నిర్వహించారు. కార్పొరేషన్ ద్వారా మున్సిపాలిటీలో 50 మందికి రుణాలు అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించగా.. అందులో 2 లక్షల రుణాలకు గాను 8 మంది పురుషులు, 5 మంది మహిళలను ఎంపిక చేశారు. 1లక్ష రుణాలకు గాను 24 మంది పురుషులు, 11 మంది మహిళలు, వికలాంగుల కోటాలో ఇద్దరు మహిళలకు, ఒక పురుషుడికి అవకాశం కల్పించారు. మైనార్టీ రుణాల కోసం మొత్తం 1,160 మంది దరకాస్తు చేసుకోగా.. డ్రా నేపథ్యంలో వందలాది మంది ముస్లింలు కార్యాలయానికి వచ్చారు. వారి ఎదుటే డ్రా తీసి అర్హులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ముస్లిం కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేస్తుందని, లక్కీ డ్రాలో అవకాశం రాని వారు నిరాశ చెందవద్దని, వారికి.. రానున్న రోజుల్లో అవకాశం కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నీరజ బాల్‌రెడ్డి, అబ్దుల్ రజాక్, రామకృష్ణ, సల్మా ఫాతిమా, మేనేజర్ ఒడిగె నరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులున్నారు. ఇదిలా ఉండగా.. డ్రా కోసం ఉదయం నుంచి కార్యాలయానికి చేరుకున్న దరఖాస్తు దారులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు.



లాటరీ తీస్తున్న ఎంపీపీ తదితరులు

మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక

బంట్వారం: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. బంట్వారం మండలానికి 6 యూనిట్లకు గాను తొర్మామిడికి రూ.లక్ష చొప్పున నలుగురికి, రూ.2 లక్షల చొప్పున బంట్వారానికి ఒకటి, రొంపల్లికి ఒకటి మంజూరైనట్లు ఎంపీడీఓ బాలయ్య తెలిపారు. ఎంపీపీ ప్రభాకర్, రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, నర్సింహులు, సూపరింటెండెంట్ షిండే, జేఏ షఫీ, ఏపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చేవెళ్ల: న్యాయవాది సత్యనారాయణపై ఘట్‌కేసర్ పోలీసుల దురుసు ప్రవర్తనను న్యాయవాదుల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని చేవెళ్ల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బక్కరెడ్డి యాదిరెడ్డి అన్నారు. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలోని జూనియర్ సివిల్‌కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసుల తీరు రోజురోజుకు విచిత్రంగా మారుతుందన్నారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం ఉండకూడదని చెప్పినా కలుగజేసుకుంటూ న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. న్యాయవాది సత్యనారాయణపై ఘట్‌కేసర్ పోలీసుల తీరుపై న్యాయవాదుల అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా స్పందించిందని, ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా ఉండాలంటే దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవిశంకర్‌గౌడ్, బాలస్వామి, మల్లేశ్, తాజుద్దీన్, జనార్దన్, మల్లేశం, మహేశ్, శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, వెంకటేశ్, యాదగిరి, తదితరులు ఉన్నారు.